క్లుప్తంగా

వాడ్రేవుపల్లి డ్రైన్‌లో క్రాస్‌బండ్ల తొలగింపు



మామిడికుదురు డ్రైన్‌లో తొలగించిన క్రాస్‌బండ్

మామిడికుదురు: మామిడికుదురులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లో ఏర్పాటు చేసిన క్రాస్ బండ్లను మంగళవారం తొలగించారు. క్రాస్ బండ్ల వల్ల ముంపునీరు నిలిచిపోయి అపరాల పంట పాడైపోయిందంటూ మామిడికుదురు, నగరం గ్రామాలకు చెందిన రైతులు నిరసన తెలిపిన నేపథ్యంలో దీనిపై డ్రైనేజ్ శాఖ అధికారులు తక్షణం స్పందించారు. డ్రైన్స్ ఏఈ ఆనంద్ కిరణ్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో రెండు చోట్ల ఏర్పాటు చేసిన క్రాస్‌బండ్లను తొలగించడంతో ముంపు నీటి పారుదలకు అడ్డంకులు తొలగిపోయాయి. క్రాస్‌బండ్ల తొలగింపుతో డ్రైన్ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరు గోదావరిలోకి సక్రమంగా పారుదల కావడంతో రైతులు ఉపశమనం పొందారు.

అన్నదాన పథకానికి రూ.10 వేల విరాళం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవగోపాలస్వామి ఆలయ అన్నదాన పథకానికి విశాఖపట్నం వాస్తవ్యుడు ప్రతాప సాయిశంకర్–పద్మహేమమాలిని దంపతులు రూ.10,116 విరాళంగా అందజేసినట్టు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి తెలిపారు. దాతలకు ఆశీర్వచన మండపం వద్ద ఆలయ సిబ్బంది, పండితులు స్వామివారి శేషవస్త్రం, స్వామివారి చిత్రపటంతో సత్కరించారు.

నిత్యాన్నదానానికి..



దాత నాగలక్ష్మికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ప్రధానార్చకుడు

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన జున్నూరి నాగలక్ష్మి మంగళవారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ సొమ్మును దాత ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

శివాలయం పునర్నిర్మాణానికి..



మోరి శివాలయం పునర్నిర్మాణానికి విరాళం ఇస్తున్న దాతలు

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన పార్వతీ సీతా రామలింగేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి మోరికి చెందిన బెల్లంకొండ నందికేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల కుమారులు రూ.25,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు పై మొత్తాన్ని మంగళవారం వారు అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

రావులపాలెం: స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో 2025 పదో తరగతి ఫలితాల్లో రావులపాలెం మండల స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థినులను, తల్లిదండ్రులను సన్మానించి కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ తరఫున నగదు, మెమెంటోలు అందజేశారు. మండల స్థాయిలో మొదటి స్థాని సాధించిన వాసంశెట్టి టింపు సాయి ఇంద్రశ్రీకి సంస్థ సభ్యుడు నందం రాజా రమేష్ రూ.10 వేలు, రెండో స్థానం సాధించిన కోలపల్లి యశస్విని నాగశ్రీకి సంస్థ సభ్యురాలు కొండల పార్వతి రూ.5 వేలు, మూడవ స్థానం సాధించిన అత్తిలి పూజితకి సంస్థ సభ్యురాలు కొవ్వూరి ప్రశాంతి రూ.5 వేలు చెక్కులు, మెమెంటోలను అందజేశారు.



మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

అధ్వానంగా పంటబోదెలు

- మరమ్మతులకు ఆమడ దూరం
- పట్టించుకోని ఉపాధి హామీ అధికారులు
- ముంపు బారిన పొలాలు

మలికిపురం: గ్రామాల్లోని ఫీడర్ చానళ్ల (పంట బోదెలు) పనితీరు నానాటికీ అధ్వానంగా మారింది. మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లోని వివిధ మీడియం, మేజర్ డ్రైన్ల పరిధిలోని సుమారు 30 గ్రామాల్లో ఈ ఫీడర్ చానళ్లు ఉన్నాయి. ప్రధానంగా ఇవి సముద్రతీర గ్రామాల్లో ఉప్పునీటి డ్రైన్లకు చేర్చి అధికంగా ఉన్నాయి. ఇవి సుమారు పదేళ్లుగా మరమ్మతులకు దూరంగా ఉన్నాయి. ప్రధానంగా సుమారు 25 కిలోమీటర్ల పొడవున్న శంకరగుప్తం మేజర్ డ్రైన్ పరిధిలోని కేశవదాసుపాలెం, చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం, కరవాక, కాత్రేనిపాడు, మెరకపాలెం, గూడపల్లి, పల్లిపాలెం, గుబ్బలపాలెం, బట్టేలంక, కత్తిమండ, మోరిపోడు, మోరి, శృంగవరప్పాడు తదితర గ్రామాల్లో ఒక్కో గ్రామంలోనూ సుమారు వందకు పైగా ఫీడర్ చానళ్లు ఉన్నాయి. ఒక్కొక్కటీ సుమారు 150 నుంచి 500 మీటర్ల పొడవు ఉంటాయి. అలాగే కూనవరం, గొంది, అంతర్వేది, పొన్నమండ, గోగన్నమఠం డ్రైన్లపై కూడా ఇవి ఉన్నాయి. వీటి ద్వారా పోటు, పాటు సమయాల్లో నీరు తోటలకు చేరి తిరిగి వెళ్లిపోతుంది. ముంపు భారం లేకపోవడంతో వాణిజ్య పంటలకు మేలు జరుగుతుంది. అలాగే వర్షాలు కురిసే సమయంలో గ్రామాల్లోని ముంపునీరు, ఇతర మురుగు నీరు ఈ చానళ్ల ద్వారా డ్రైన్‌లోకి చేరి గోదావరికి పోతుంది. ఇలా అత్యంత గురుతర బాధ్యత నిర్వహిస్తాయి. అయితే ఇవి ప్రస్తుతం పూడుకుపోయి నీటి పారుదల ఇబ్బందిగా మారింది. నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. కొబ్బరితోటలపై ఉప్పు నీటి ప్రభావం పడి చనిపోతున్నాయి. గత పదేళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. గతంలో ఉపాధి హామీ పథకంలో ఈ ఫీడర్ చానళ్లను చేర్చి మరమ్మతులు నిర్వహించేవారు. అయితే పదేళ్ల నుంచి ఈ శాఖ ఈ చానళ్లనే మరిచింది. వర్షాకాలం వచ్చేస్తున్న ప్రస్తుతం తరుణంలో వీటి మరమ్మతులు పూర్తి చేయకపోతే రానున్న ఏడాది పాటు రైతులకు ఇక్కట్లే. డ్రైన్లకు, వ్యవసాయ పొలాలకు, నివాస ప్రాంతాలకు అనుసంధానమై ఉన్న ఈ చానళ్ల అభివృద్ధిపై అటు ఇరిగేషన్, ఇటు డ్రైనేజీ శాఖ పూర్తి నిర్లక్ష్య వైఖరితో ఉన్నాయి. వీటి మరమ్మతులకు ఆయా శాఖలు ప్రత్యేక గ్రాంటు కేటాయించాల్సి ఉండగా ఆ దిశగా కృషి జరగడం లేదు. పోనీ ఉపాధి హామీ పథకంలో చేర్చినా పూర్తి స్థాయిలో వాటి అభివృద్ధి జరగడం లేదు. శంకరగుప్తం డ్రైన్ పరిధిలోని ఏ గ్రామాల్లో కూడా చేపట్టడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో రైతులు, సాధారణ ప్రజానీకం నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలంలో ఈ చానళ్లు పని చేయకపోతే గ్రామాలు మరింత ముంపుబారిన పడే ప్రమాదం కూడా ఉంది. ఇప్పటికే పోటు, పాటు సమయాల్లో ఈ గ్రామాల్లో నివాస ప్రాంతాలకు సైతం ఉప్పునీరు చేరుతోంది. గత ఐదేళ్లుగా ఈ ప్రాంతంలో ఇదే జరుగుతుంది. పల్లపు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఈ గ్రామాల్లో పంచాయతీ డ్రైన్‌లు సైతం లేకపోవడం వల్ల ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఫీడర్ చానళ్లను అయినా మరమ్మతులు నిర్వహించకపోవడం గమనార్హం.



కేశనపల్లిలో అభివృద్ధికి నోచని ఫీడర్ చానల్

అస్తవ్యస్తంగా ఉన్నాయి



గ్రామాల్లోని ఫీడర్ చానళ్లకు పదేళ్లుగా మరమ్మతులు లేవు. పూడుకుపోయి అస్తవ్యస్తంగా ఉన్నాయి. పోటు, పాటు సమయంలో తోటలకు చేరిన నీరు కిందికి దిగక తోటల్లోనే ఉండిపోయి తీవ్ర నష్టం ఏర్పడుతుంది. వర్షాకాలంలో ముంపు నీరు దిగదు. వెంటనే మరమ్మతులు చేయాలి.

– యెనుముల నారాయణస్వామి, మాజీ సర్పంచ్, కేశనపల్లి

మెరుగ్గా నిర్వహించాలి



గ్రామాల్లో రైతులకు మేలైన పనులను గుర్తించి ఉపాధి హామీ పథకంలో చేర్చాలని అధికారులకు, సిబ్బందికి సూచించాం. లేకుంటే కేంద్రం ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న నిధులు అక్కరకు రాకుండా పోయే ప్రమాదం ఉంది. ఫీడర్ చానళ్ల మరమ్మతులతో పాటు వ్యవసాయ అనుబంధ పనులు గుర్తించి ఉపాధి పథకంలో చేర్చండి. సమస్య ఉన్న రైతులు ఉపాధి సిబ్బందిని సంప్రదించండి.

– దేవ వరప్రసాద్, ఎమ్మెల్యే, రాజోలు

మాజీ సీఎం జగన్‌ను కలసిన సాయిరామ్



తాడేపల్లిలో జగన్‌ను మర్యాద పూర్వకంగా కలసిన సాయిరామ్

పి.గన్నవరం: తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పి.గన్నవరానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిస్థితులపై జగన్ ఆరా తీసినట్టు సాయిరామ్ వివరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్ ఆదేశించినట్టు సాయిరామ్ తెలిపారు.

ఆధార్ అనుసంధానంతో అవకతవకలు

మలికిపురం: రాష్ట్రంలో విద్యుత్ మీటర్లు ఆధార్‌తో అనుసంధానం పేరుతో అనేక అవకతవకలు జరిగాయని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఆరోపించారు. మంగళవారం ఆయన లక్కవరంలో విలేకరులతో మాట్లాడుతూ కొంతమందికి ఒకే మీటరు ఉన్నప్పటికీ ఆధార్ కార్డులో మూడు నాలుగు మీటర్లు ఉన్నట్టు చూపించడం వల్ల తల్లికి వందనం ఖాతాలో డబ్బులు జమ కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు వ్యక్తులు వారి ఇష్టం వచ్చినట్లు నమోదు చేయడం వల్ల పనులు మానుకుని ఆఫీసుల చుట్టూ తిరుగుతూ చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒక మీటరు కన్నా ఎక్కువ నమోదైన వాటిని తొలగించి ప్రభుత్వం ఇచ్చిన గడువును కూడా పెంచి తల్లికి వందనం ఖాతాలో జమ కాని వారందరికీ వారి, వారి ఖాతాలో జమ అయ్యేలా తగు చర్యలు తీసుకొని వారందరినీ ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రిమాండ్ ఖైదీలంతా సత్ప్రవర్తనతో మెలగాలి



సబ్‌జైలులో రిమాండ్ ఖైదీల సంక్షేమంపై సమీక్షిస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శ్రీలక్ష్మి

కొత్తపేట: రిమాండ్‌లో ఉన్న ఖైదీలంతా సత్ప్రవర్తనతో మెలిగి, కుటుంబ సభ్యులతో కలసి సమాజంలో గౌరవంగా జీవించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (రాజమహేంద్రవరం) సెక్రటరీ ఎస్.శ్రీలక్ష్మి సూచించారు. ఆమె మంగళవారం స్థానిక సబ్‌జైలును సందర్శించారు. రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితుల వివరాలు, బాగోగులు, వారిపై నమోదైన కేసులు, వారి వారి కుటుంబాలు, స్థితిగతుల గురించి ఆరా తీశారు. అవగాహన లోపంతోనో, క్షణికావేశంలో, తెలిసో తెలియకో చేసిన తప్పుల కారణంగా ఈరోజు మీరు ఇక్కడ ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడి ఉండవచ్చు. అయితే ఇకపై అటువంటి తప్పులకు, ఏ విధమైన కేసులకు అవకాశం లేకుండా భవిష్యత్ జీవితాన్ని మంచిగా మలుచుకోవాలని సూచించారు. అనంతరం సబ్‌జైలు లోపల పరిసరాలు, ఖైదీల సెల్స్, సౌకర్యాలను, వారి భోజనం నాణ్యత, వంటశాల, బాత్‌రూమ్స్ పరిశుభ్రత పరిశీలించారు. జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. ఖైదీలకు లీగల్ ఎయిడ్ ద్వారా న్యాయవాదుల నియామకం గురించి చర్చించారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్ టీఎస్ఎస్ మోహన్, పీఎల్‌వీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సభ్యుల ఏకరవు



సమావేశంలో హౌసింగ్ సమస్యలపై ఏఈతో మాట్లాడుతున్న సర్పంచ్ యెనుముల నాగు

మలికిపురం: వివిధ గ్రామ సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఏకరవుపెట్టారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి అధ్యక్షతన మలికిపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీడీఓ మల్లికార్జునరావు వివిధ సమస్యలపై మాట్లాడాలని ఆయా శాఖల అధికారులను వేదిక పైకి పిలిచారు. గృహనిర్మాణ శాఖ అధికారులు మాట్లాడుతున్న సమయంలో కేశనపల్లి సర్పంచ్ యెనుములు నాగు మాట్లాడుతూ లబ్ధిదారులను ఇళ్ల నిర్మాణం చేసుకోమని బిల్లులు తరువాత వస్తాయని అధికారులు చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చినట్టు పేర్కొన్నారు. అలా చెప్పవద్దని ప్రభుత్వం మంజూరు చేస్తేనే మీరు హామీ ఇవ్వాలని లేకుంటే గ్రామాల్లో తాము తిరగలేమని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ సభ్యులు, ఎంపీటీసీలు కూడా ప్రజా సమస్యలు మీకే తెలుసు కదా మీరే చెప్పాలని తమను హేళన చేస్తున్నారని సర్పంచ్ నాగు వాపోయారు. కేశనపల్లి పీహెచ్‌లో మందులు ఉండడం లేదని ఆయన అన్నారు. అలాగే గ్రామాల్లో ఆబోతులు, కుక్కల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ వైద్యులు బి.శివకుమార్‌ను కోరారు. శివకుమార్ మాట్లాడుతూ కుక్కల నివారణ బాధ్యత పంచాయతీలదేని, ఆబోతులపై చర్యలు ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామన్నారు. వ్యవసాయాధికారి సీహెచ్ రమ్య ప్రియాంక మాట్లాడుతూ రానున్న సార్వా నాట్లకు రైతులు సిద్ధం కావాలని, విత్తనాలు ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనవద్దని ప్రభుత్వం సూచించిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని లేకుంటే నకిలీల బారినపడే ప్రమాదం ఉందన్నారు. ప్రతి పది ఎకరాలకు ఒకటి చొప్పున మట్టి పరీక్షలు చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఉపాధి పథకంలో ఇంటింటికీ కంపోస్టు పిట్‌లు మంజూరు చేసిందని లబ్ధిదారులు దరకాస్తులు చేసుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ గేదెల లక్ష్మి సూచించారు. తహసీల్దార్ టి.ఈశ్వరరావు, ఎంఈఓ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్ఓ బి.అప్పారావు అన్నారు. వాకలగరువులో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ పార్ట్‌నైట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించి అవగాహన కల్పించారు. అప్పారావు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకూ నిర్వహించే అతిసార నిరోధక కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఐదేళ్లలోపు పిల్లల వివరాలు సేకరించాలని, వాళ్లకు నీళ్ల విరేచనాలు అయితే వారిని గుర్తించి వారికి ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ టాబ్లెట్ల ద్వారా చికిత్స అందించాలని సూచించారు. ఎంపీహెచ్ఎస్ ఎ.రాధానరసింహం, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ సుభాషిణి, సంధ్య, ఏఎన్ఎం జ్యోతి, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవం



నగరంలో నిత్యహోమంలో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: నగరం గ్రామంలోని బీఎస్‌మూర్తి రోడ్డులోని శ్రీహరి క్షేత్రంలో కొలువైన శ్రీహనుమాన్ లక్ష్మణ సమేత సీతారామచంద్రస్వామి వార్ల ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం నిత్య హోమం, సుదర్శన నారసింహ సహిత రామ పంచముఖ హనుమాన్ హవనం, అన్న సమారాధనలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కాశి ఆదిశేష శ్రీనివాస్ (నాని) ఆధ్వర్యంలో నిత్య హోమం అనంతరం స్వామి వార్ల 15వ వార్షిక కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అన్నమాచార్య భక్త రామదాసు సంకీర్తనలతో 108 మంది దంపతులతో కల్యాణోత్సవాన్ని వేద పండితులు రమణీయంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు ఈ కల్యాణోత్సవ పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అర్చకుల నుంచి వేద ఆశీర్వచనం అందుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యానిమేటర్ల వసూళ్లపై సభ్యుల ధ్వజం

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా శ్రీనివాసరావు

రాజోలు: డ్వాక్రా మహిళల నుంచి యానిమేటర్ల డబ్బుల వసూళ్లపై రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. మంగళవారం రాజోలు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. గ్రామాల్లో డ్వాక్రా యానిమేటర్ల పనితీరు సక్రమంగా ఉండడం లేదని, డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి రుణ మంజూరు సమయంలో లక్ష రూపాయలకు వెయ్యి రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని కడలి సర్పంచ్ చొప్పల గుణనాథ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డ్వాక్రా మహిళలను ఇబ్బందులకు గురి చేసే యానిమేటర్లను గుర్తించి వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు ఏపీఓ వర్మకు సూచించారు. దీంతో అన్ని గ్రామాల్లో యానిమేటర్ల పనితీరు చాలా అధ్వానంగా ఉందని, ఆయా గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీలను పట్టించుకోకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లోని డ్వాక్రా మహిళల నుంచి బలవంతపు వసూళ్ల చేయడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చూడాలని ఎంపీపీ కేతా శ్రీనివాసరావు ఏపీఎం వర్మకు సూచించారు. గ్రామాల్లో ఉన్న యానిమేటర్లతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశాలు నిర్వహించి యానిమేటర్లపై వస్తున్న ఆరోణలను నిగ్గు తేల్చాలన్నారు. పొదలాడ లాకును ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని సర్పంచ్ కడలి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాజోలు– శివకోడు పంటకాలువలో పూడిక తూతూ మంత్రంగా తీశారని, మట్టిని తీసి రోడ్డు పక్కన వేయడంతో వర్షాకాలంలో మట్టి కరిగి వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతారని శివకోడు ఎంపీటీసీలు ఉండ్రు సూర్యారావు, బొడ్డు కృష్ణారావులకు ఇరిగేషన్ ఏఈ రమేష్ దృష్టికి తీసుకువెళ్లారు. పూడిక తీసిన మట్టిని తరలించేందుకు ట్రాక్టర్‌కు రూ.500 ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ డిమాండ్ చేశారని ఆరోపించారు. తాటిపాక పంటకాలువలో గుర్రపుడెక్క తొలగించలేదని, నామమాత్రంగా పూడిక పనులు చేశారని సర్పంచ్ కోటిపల్లి రత్నమాల సభలో నిలదీశారు. తాటిపాక పీహెచ్‌సీ ఆవరణ కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురవుతుందని, దానికి మెరక చేయాలన్నారు. మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ భాస్కరరావు, ఏఓ ఎం.సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు

పి.గన్నవరం: టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక మణి ఆధ్వర్యంలో ముంగండ అంగన్‌వాడీ కేంద్రం వద్ద మంగళవారం క్షయ వ్యాధి నివారణపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం అంటూ గ్రామస్తులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుసుమ చంద్రకళ, డాక్టర్ రామానుజరావు, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ చక్రధర్, కుసుమ వెంకటేశ్వరరావు, పీఎస్ శాంతామణి, వి.వినీతకుమారి, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో భాగంగా 13 మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని తెలిపారు. మండలంలోని వానపల్లిలో ముషిణి వెంకటరమణ వద్ద 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన వైద్యాధికారులు



జాన్‌లెవీ | సుమప్రియ

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిగా కాశి సుమప్రియ ఉద్యోగ బాధ్యతలను మంగళవారం స్వీకరించారు. కృష్ణా జిల్లా తాళ్లపాలెం పీహెచ్‌సీ నుంచి బదిలీపై వచ్చారు. సుమప్రియ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తానన్నారు. ప్రస్తుత వాతావరణంలో విష జ్వరాలు, రోగాల బారిన పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు పాటించాలన్నారు.

నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా జాన్‌లెవీ

మామిడికుదురు: నగరం పీహెచ్‌సీ వైద్యాధికారిగా ఐ.జాన్‌లెవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ వైద్యాధికారిగా పని చేసిన స్వర్ణలత ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన లెవీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు. నగరం పీహెచ్‌సీలో మరో ఇద్దరు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఎంపీహెచ్ఎస్ మేల్ వర్కర్‌గా పని చేస్తున్న సత్యనారాయణ గోపాలపురం పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో లక్కవరం పీహెచ్‌సీలో పని చేస్తున్న బళ్ల నరసింహారావు జాయిన్ అయ్యారు. ఎల్‌టీగా పని చేస్తున్న బీవీఎస్ఎస్ మూర్తి లక్కవరం బదిలీ కాగా ఆయన స్థానంలో బండారులంకలో పని చేస్తున్న ఎం.సుప్రజ నగరం పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



బి.సాయిశ్రీవిద్య



పి.లక్ష్మీప్రణవ్య



ఆర్.రమేష్‌బాలసాయినాథ్



కె.యజ్ఞప్రియ



ఎస్.రజియా బేగం



జి.తేజస్వి



సీహెచ్ తేజస్విమణిదుర్గ



ఎన్.అక్షయ



డి.సత్యభాస్కర్



ఆర్.యామినీప్రియ



జి.సురేష్

కొత్తపేట: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. కొత్తపేట మండల పరిధిలోని 12 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 5 పాఠశాలల నుంచి 10 మంది విద్యార్థులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి, రాష్ట్రంలోని వివిధ ట్రిపుల్ ఐటీలకు ఎంపికయ్యారు. వానపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బళ్ల సాయిశ్రీవిద్య, పి.లక్ష్మీ ప్రణవ్య, రాయుడు రమేష్ బాలసాయినాథ్, కడలి యజ్ఞప్రియ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం ముద్రగడ వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి సయ్యద్ రజియా బేగం, గండ్రోతు తేజస్వి ఎంపికైనట్టు హెచ్ఎం ఎన్.సత్యనారాయణ తెలిపారు. అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి చెవుడు తేజస్వి మణిదుర్గ, నక్కా అక్షయ ఎంపికైనట్టు హెచ్ఎం అరుణశ్రీ తెలిపారు. బిళ్లకుర్రు శివారు కొత్తపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి దంగేటి సత్యభాస్కర్ ఎంపికైనట్టు హెచ్ఎం అక్కిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. వానపల్లి శివారు తొత్తుపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి రెడ్డి యామినీప్రియ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం బీబీ శాస్త్రి తెలిపారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీకి..

అంబాజీపేట: కె.పెదపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గుత్తుల సురేష్ ట్రిపుల్‌కి ఎంపికైనట్లు హెచ్ఎం సీహెచ్ వేణుగోపాలకృష్ణ తెలిపారు. ట్రిపుల్ ఐటీ ఒంగోలులో సీటు సాధించిన సురేష్‌కు సర్పంచ్ బీర శాంతి, ఎంపీటీసీ ఈతకోట ఉషా భార్గవి, విద్యాకమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రేకు తొలగించి శ్లాబ్ వేయాలి



స్థానికులతో కలసి కల్యాణ మంటపాన్ని పరిశీలించి జేఈ శ్రీరామరాజు

మామిడికుదురు: రెండేళ్ల నుంచి మూతపడి నిరుపయోగంగా మారిని మామిడికుదురులోని టీటీడీ కల్యాణ మంటపాన్ని టీటీడీ ఇంజినీరింగ్ విభాగం జేఈ సాగిరాజు శ్రీరామరాజు మంగళవారం పరిశీలించారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచనల మేరకు జేఈ కల్యాణ మంటపాన్ని పరిశీలించి, స్థలదాత యాలి శ్రీనివాస్‌తో పాటు స్థానిక నేతలతో మాట్లాడారు. కల్యాణ మండలం సీలింగ్ పాడైపోయిందని, మంటపం పైన ఉన్న రేకును తొలగించి దాని స్థానే శ్లాబ్ వేయాలని కోరారు. మండల కేంద్రంలో రూ. కోట్లు విలువైన స్థలం ఇచ్చామన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడి కల్యాణ మంటపం నిర్మించేలా కృషి చేసినా అది రెండేళ్ల నుంచి నిరుపయోగంగా మారడం బాధిస్తోందన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకుని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

విద్యార్థిని చదువుకు ఎన్నారై సాయం

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకకు చెందిన పేద విద్యార్థినికి కోమలి రమాదేవి చదువుకు ఆర్థికసాయం చేసేందుకు హామీ లభించింది. వివరాల్లోకి వెళితే చెముడులంకలోని జెడ్పీ హైస్కూల్‌లో 2024–25లో పదోతరగతి చదివిన రమాదేవి 564 మార్కులు సాధించింది. దీంతో పాటు ఇటీవల నిర్వహించిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించింది. దీంతో రమాదేవికి పెద్దాపురం మండలం సూరంపాలెంలోని ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో ఉచిత సీటు లభించింది. అయితే పుస్తకాలు, బస్సు ఫీజుకు ఏటా సుమారు రూ.60 వేల వరకూ ఖర్చు అవుతుండటంతో ఆ భారం భరించలేక చదువుకు స్వస్తి పలికేందుకు నిర్ణయించుకుంది. విషయం తెలుసుకున్న మడికి గ్రామానికి చెందిన ఎన్నారై అత్తిలి రమేష్ ఆ విద్యార్థిని రమాదేవిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో పాలిటెక్నిక్ కోర్సు పూర్తయ్యే వరకూ అయ్యే ఖర్చు భరించాలని నిర్ణయించుకున్నారు, దీంతో ఎన్నారై రమేష్ ఉదారతపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.